ఆంధ్రజ్యోతి
27. march. 2014.
Guntur-city.

# వైద్య వృత్తిపై నిబద్ధత ఉండాలి

**హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ గోఖలే ● జీఎంసీలో ఘనంగా 63వ గ్రాడ్యుయేషన్ వేడుకలు**



ప్రసంగిస్తున్న సీటీ సర్జన్ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే



డాక్టర్ గోఖలే నుంచి డిగ్రీ అందుకుంటున్న యువ వైద్యులు

గుంటూరు (మెడికల్): కఠోర శ్రమ, అంకితభావం, వృత్తిపై నిబద్ధతతో వ్యవహరిస్తే వైద్యరంగంలో ఉన్నత స్థానానికి చేరవచ్చని ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ఆలా గోపాలకృష్ణ గోఖలే యువ వైద్యులకు పిలుపునిచ్చారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో బుధవారం జరిగిన కళాశాల 63వ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 2008 బ్యాచ్‌కు చెందిన 158 మంది యువ వైద్యులకు డాక్టర్ గోఖలే మెడిసిన్ పట్టా ప్రదానం చేశారు. వైద్య వృత్తి ప్రమాణాలు నిలబెడతామని వారితో ప్రమాణం చేయించారు. ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య సాగిన ఈ గ్రాడ్యుయేషన్ సెర్మనీలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్లుగా ఎదగటం ద్వారా తలిదండ్రుల కల నెరవేర్చారని, ఇదే స్ఫూర్తితో సమాజ సేవ చేయాలని డాక్టర్ గోఖలే సూచించారు. సమాజంలో వైద్యులపై చక్కటి గౌరవ మర్యాదలు ఉన్నాయని, వీటిని గుర్తెరిగి బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. జబ్బు నయం చేసి రోగిని డిశ్చార్జీ చేసే సమయంలో వారు చూపే కృతజ్ఞతతో వృత్తిపరంగా ఎంతో ఆత్మసంతృప్తి లభిస్తుందని ఆయన వివరించారు. యువ వైద్యులు ఉన్నత లక్ష్యాలు నిర్ధేశించుకొని వాటిని అధిగమించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించాలని డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే పేర్కొన్నారు. సంపాదన కోసం ఆరాట పడవద్దని, రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలు అందించడంపైనే దృష్టి సారించాలని ఆయన సూచించారు. రోగులతో సానుభూతితో, దయతో వ్యవహరించాలని చెప్పారు.

## వృత్తి ప్రమాణాలు పరిరక్షించాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శైలబాల మాట్లాడుతూ కొత్తగా వైద్య పట్టాలు పొందిన యువ వైద్యులు వృత్తి ప్రమాణాలు పాటించి క్రమశిక్షణతో వ్యవహరించాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్ రాజునాయుడు మాట్లాడుతూ ఎంబీబీఎస్‌తో చదువు ఆపవద్దని, ఉన్నత విద్యావకాశాలు అందిపుచ్చుకొని వృత్తిపరంగా ఎదగాలని ఆకాంక్షించారు. వైద్య వృత్తికి వంద శాతం న్యాయం చేసి ఆదర్శవంతమైన డాక్టర్లుగా ఎదగాలని కోరారు. జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ డీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యరంగంలో మెడిసిన్ చేసిన డాక్టర్లు తమ వంతు సామాజిక బాధ్యతగా ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం యువ వైద్యులకు డాక్టర్ గోఖలే, డాక్టర్ శైలబాల తదితరులు వైద్య పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మునీర్ కన్నా, సీనియర్ వైద్యులు ఎన్‌వీఎస్ చౌదరి, మన్నం రాధాకృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్ పీవీ రాఘవశర్మ తదితరులు పాల్గొన్నారు. తొలుత మెడికో యేకుల అనుదీప్ ఆహూతులను వేదికపైకి ఆహ్వానించారు. డిగ్రీ పట్టా అందుకున్న యువ వైద్యులు కుటుంబ సభ్యులతో, మిత్రులతో కలసి ఫొటోలు దిగారు.

